# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 12-06-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **ఆంధ్రప్రదేశ్ నూతన ముఖ్యమంత్రిగా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు ప్రమాణ స్వీకారం చేస్తారు.**

**2.** **ప్రమాణ స్వీకారోత్సవానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు పలువురు ప్రముఖులు హాజరు కానున్నారు.**

**3.** **దేశంలో విమానాశ్రయాల అభివృద్ధికి కృషి చేస్తానని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.**

**4.** **వేసవి సెలవులు అనంతరం తెలంగాణలో ఈరోజు నుంచి పాఠశాలలు పున:ప్రారంభం కానున్నాయి.**

**5.** **ఈ రోజు ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక అవగాహనా దినోత్సవం నిర్వహిస్తున్నారు.**

==========================

ఆంధ్రప్రదేశ్ నూతన ముఖ్యమంత్రిగా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఈరోజు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. కృష్ణా జిల్లా కేసరపల్లి ఐటీ పార్కు సమీపంలో ఈ కార్యక్రమం జరగనుంది. ఈ రోజు ఉదయం 11 గంటల 27 నిమిషాలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ చంద్రబాబు నాయుడు చేత ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. ఆయనతో పాటు పలువురు మంత్రుల చేత కూడా గవర్నర్ ప్రమాణ స్వీకారం చేయిస్తారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి సంబంధించిన మరిన్ని వివరాలను మా విజయవాడ ప్రతినిధి కొల్లి నవీన్ తెలియజేస్తూ..

..వాయిస్.. 45 సెకన్లు

-------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని ఎన్డీయే కూటమి నేతలను గవర్నర్ ఆహ్వానించారు. విజయవాడలో జరిగిన టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి శాసన సభా పక్ష సమావేశంలో తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడును ఎన్డీఏ శాసనసభా పక్ష నేతగా ఎన్నుకున్న అనంతరం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్‌లు గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కలిశారు. తమను ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని కోరుతూ కూటమి ఎమ్మెల్యేల మద్దతు లేఖను అందించారు.కాగా నిన్న విజయవాడ రాజ్ భవన్‌లో నారా చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్

గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను కలిశారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో ఆయన గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వ ఏర్పాటు, మంత్రుల కూర్పునకు సంబంధించి గవర్నర్‌కు చంద్రబాబు వివరించారు.

మరోవైపు తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్న క్రమంలో ఆయనతో పాటు మరో 24 మంది మంత్రులూ ప్రమాణం చేయనున్నారు. పవన్ కల్యాణ్ సహా మొత్తం 24 మంది మంత్రుల జాబితాను గత అర్ధరాత్రి దాటాక ప్రకటించారు. ఈ జాబితాలో జనసేనకు మూడు, భారతీయ జనతా పార్టీకి ఒక స్థానం కేటాయించారు.

---------------------------

దేశంలో విమానాశ్రయాల అభివృద్ధికి కృషి చేస్తానని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. నిన్న ఢిల్లీలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, త్వరలో బాధ్యతలు చేపట్టి, పౌర విమానయాన శాఖకు సంబంధించి దేశానికి ఒక సమగ్ర ప్రణాళిక తయారు చేసి ముందుకు సాగుతామన్నారు. తిరుపతి, విజయవాడ సహా ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న విమానాశ్రయాలలో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తామని రామ్మోహన్ నాయుడు పేర్కొంటూ...

వాయిస్ ..32 సెకన్లు

---------------------------

వేసవి సెలవులు అనంతరం తెలంగాణలో ఈ రోజు నుంచి పాఠశాలలు పున:ప్రారంభం కానున్నాయి. సెలవులు ముగియడంతో ఈ రోజు తరగతుల్ని నిర్వహించేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యా సంవత్సరం ప్రారంభం కానుంది. తెలంగాణ ప్రభుత్వ పాఠశాలల్లో చేరికల్ని ప్రోత్సహించేందుకు ఇప్పటికే బడిబాట కార్యక్రమాన్ని ప్రారంబించారు. ఈ బడిబాట కార్యక్రమం జూన్ 19 వరకు కొనసాగనుంది. అందులో భాగంగా ఈ రోజు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాఠశాలలను పున:ప్రారంభించనున్నారు. ఈ ఏడాది నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో తరగతుల్ని ఉదయం 9 గంటలకే ప్రారంభించనున్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఈఏపీసెట్ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. ఈ ఫలితాలను ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జె.శ్యామలరావు విడుదల చేశారు. ఇంజినీరింగ్ విభాగంలో 75.51శాతం విద్యార్థులుఅర్హత సాధించగా, అగ్రికల్చర్ విభాగంలో 87.11శాతం ఉత్తీర్ణత సాధించినట్లు అధికారులు వెల్లడించారు. ఇంజినీరింగ్‌లో ఎం.జిష్ణు సాయి, ఎం సాయి యశ్వంత్ రెడ్డి, బి. సందేశ్‌లు తొలి మూడు స్థానాల్లో నిలువగా,అగ్రికల్చర్ విభాగంలో ఏ.శ్రీకాంత్ రెడ్డి, పి. దివ్యతేజ వి. ముఖేశ్ చౌదరి తొలి మూడు స్థానాల్లో నిలిచారని తెలిపారు. ఈ పరీక్షకు 3.62 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా.. 3.39 లక్షల మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు.

---------------------------

తెలంగాణలో ఆహార కల్తీ చేసే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని.. నాణ్యమైన ఆహారాన్ని ప్రజలకు

అందించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. హైదరాబాద్‌లో నిన్న హోటళ్లు, బార్లు, రెస్టారెంట్లు, బేకరీ నిర్వాహకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఆహారంలో నాణ్యత పాటిస్తూ, హోటళ్ల యజమానులు సామాజిక బాధ్యతతో వ్యవహరించాలన్నారు. కాలపరిమితి దాటిన ఆహారపదార్థాలు వినియోగించకుండా చూసుకోవాలని తెలిపారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఆహారంలో నాణ్యతపై కార్యశాలల నిర్వహణతో పాటు అవగాహన సదస్సులను నిర్వహిస్తామని వెల్లడించారు.

---------------------------

ఈ రోజు ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక అవగాహనా దినోత్సవం నిర్వహిస్తున్నారు. ప్రపంచ కార్మిక సంస్థ-ఐఎల్ పిలుపు మేరకు 2002వ సంవత్సరం నుండి ప్రతి ఏటా జూన్ 12వ తేదీన ఈ కార్యక్రమం జరుగుతోంది. ప్రపంచ వ్యాప్తంగా అన్ని ప్రదేశాలలో బాల కార్మికులను నిర్మూలించడం, బాల కార్మికులను గుర్తించి, వారికి నాణ్యతతో కూడిన ఉచిత విద్యను అందించడం, ఎటువంటి పరిస్థితులలోనూ కార్మికులుగా పిల్లలు నియుక్తులు కాకుండా చూడడం ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక అవగాహనా దినోత్సవ నిర్వహణలోని ముఖ్యోద్దేశం. “బాల కార్మికుల వ్యవస్థను నిర్మూలించేందుకు సమిష్టిగా పని చేద్దాం” అనే ఇతివృత్తంతో ఈ ఏడాది కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో నైరుతి ఋతుపవనాల ప్రభావంతో రాబోయే రెండు రోజులూ తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలియజేసింది. ఉరుములతో కూడిన మెరుపులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశముందని వెల్లడించింది. ఈదురు గాలులు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలియజేశారు.

నైరుతి రుతుపవనాలు తెలంగాణలోని కొన్ని ప్రాంతాలకు పురోగమించాయని, రానున్న 48 గంటల్లో ఇవి రాష్ట్రంలో మరికొన్ని ప్రాంతాల్లోకి మరింత విస్తరిస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో, ఈ రోజు తెలంగాణలోని పలు జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు. మరో మూడు రోజుల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. గత 24 గంటల్లో తెలంగాణలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురిశాయని వాతావరణ శాఖ పేర్కొంది.

---------------------------

పారదర్శకంగా పనిచేస్తూ రవాణాశాఖ ఆదాయాన్ని పెంచాలని తెలంగాణ రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. రవాణాశాఖ పనితీరుపై నిన్న హైదరాబాద్ సచివాలయంలో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ రోజు నుంచి తెలంగాణలో పాఠశాలలు ప్రారంభంకానున్న నేపథ్యంలో పాఠశాలల బస్సుల ఫిట్‌నెస్‌పై వారం పాటు తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. వాహనదారుల డ్రైవింగ్ లైసెన్సులు, రిజిస్ట్రేషన్ల విషయంలో అవినీతికి తావు లేకుండా.. కొత్త విధానంపై అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు.

---------------------------

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు విద్యాకానుక కిట్లను అందించేందుకు సమగ్ర శిక్ష విభాగం ఏర్పాట్లు చేస్తోంది. విద్యాకానుక కిట్లను 2024-25 విద్యా సంవత్సరంలో విద్యార్థి కిట్ గా అందించనున్నట్లు సమగ్ర శిక్ష అభియాన్ అధికారులు తెలిపారు. రేపటి నుంచి పాఠశాలలు ప్రారంభంకానున్న నేపథ్యంలో మండల స్టాక్ పాయింట్ల నుంచి విద్యార్థి కిట్లను ఆయా పాఠశాలలకు పంపించాలని సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు.

======================